సాక్షి
కామారెడ్డి
బుధవారం ၊ 21 ၊ ఫిబ్రవరి ၊ 2024



ప్రజలను మోసం చేసింది

అభివృద్ధి చేయకుండా గత ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు విమర్శించారు.

- 9లో ▸



ఆదర్శంగా తీర్చిదిద్దుతా

అన్ని గ్రామాలను అభివృద్ధి చేసి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పేర్కొన్నారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
34.5 /16.2


వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరగవచ్చు. రాత్రి చలిగా ఉంటుంది.

కమల సంకల్పం!

- పార్లమెంటు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీజేపీ అడుగులు
- తాండూరు నుంచి కరీంనగర్ వరకు యాత్రకు శ్రీకారం
- జిల్లాలో రెండు రోజులు కొనసాగనున్న విజయ సంకల్ప యాత్ర

మరోసారి మోదీ సర్కారు నినాదంతో బీజేపీ జనంలోకి వెళ్తోంది. రాష్ట్రంలో గణనీయ సంఖ్యలో ఎంపీ స్థానాలను కైవసం చేసుకోవాలన్న లక్ష్యంతో విజయ సంకల్ప యాత్రకు శ్రీకారం చుట్టింది. మంగళవారం తాండూరులో ప్రారంభమైన రాజరాజేశ్వర క్లస్టర్ యాత్ర.. జిల్లామీదుగా సాగనుంది. జహీరాబాద్‌పై కాషాయ జెండా ఎగరేయాలన్న ఉత్సాహంతో ఉన్న బీజేపీ శ్రేణులు యాత్రను విజయవంతం చేయడానికి సన్నద్ధమవుతున్నాయి.



సాక్షి, కామారెడ్డి : అసెంబ్లీ ఎన్నికలలో గణనీయ సంఖ్యలో ఓట్లు సాధించిన బీజేపీ.. పార్లమెంట్ నియోజకవర్గాలపై ఫోకస్ చేసింది. ఎన్నికల కోసం పార్టీ శ్రేణులను సన్నద్ధం చేయడం కోసం విజయ సంకల్ప యాత్రలు చేపట్టింది. రాష్ట్రాన్ని ఐదు క్లస్టర్లుగా విభజించింది. రాజరాజేశ్వర క్లస్టర్ పరిధిలో చేవెళ్ల, మెదక్, జహీరాబాద్, కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గాలున్నాయి. మంగళవారం చేవెళ్ల నియోజకవర్గంలోని తాండూర్‌లో యాత్ర ప్రారంభమైంది. రోజూ రెండుమూడు అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా యాత్ర సాగనుంది. జహీరాబాద్ ని యోజకవర్గం పరిధిలోకి వచ్చే కామారెడ్డి జిల్లాలోని జుక్కల్, బాన్సువాడ, ఎల్లారెడ్డి, కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గాల్లో రెండు రోజులపాటు యాత్ర కొనసాగుతుంది. బీజేపీ రాష్ట్ర నాయకులతో పాటు జాతీయ నాయకులు కూడా యాత్రలో పాల్గొని, సభలలో ప్రసంగిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి.

జహీరాబాద్ టికెట్టు కోసం తీవ్ర పోటీ..

కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి విజయం సాధించడం, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థులకు ఇరవై వేలకు పైగా ఓట్లు రావడంతో జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీచేయడానికి చాలా మంది ఆసక్తి చూపుతున్నారు. మోదీ చరిష్మా, రామమందిరం కల సాకారం కావడం వంటి వాటితో గెలుపు సులువవుతుందనే భావనతో బీజేపీ టికెట్టు కోసం క్యూ కడుతున్నారు. ఇక్కడినుంచి పోటీ చేయడానికి 35 మంది ప్రయత్నాలు చేసుకుంటున్నట్లు తెలిసింది. ఇందులో కామారెడ్డి జిల్లాకు చెందిన బాణాల లక్ష్మారెడ్డి, పైడి ఎల్లారెడ్డి, సోమాయప్ప స్వామి, వడ్డెపల్లి సుభాష్‌రెడ్డి, ఏలేటి సురేశ్‌రెడ్డి, మేడపాటి ప్రకాశ్‌రెడ్డి తదితరులున్నారు. పార్టీ సీనియర్ నాయకులైన జైపాల్‌రెడ్డి, బద్దం మహీపాల్‌రెడ్డి, ఆకుల విజయ, ఆలె భాస్కర్ తదితరులు కూడా జహీరాబాద్ స్థానంనుంచి పోటీ చేయడానికి ఉత్సాహంతో ఉన్నారని తెలుస్తోంది.

యాత్రకు సన్నద్ధమవుతున్న ఆశావహులు..

తాండూరులో ప్రారంభమైన రాజరాజేశ్వర క్లస్టర్ విజయ సంకల్ప యాత్ర మెదక్ జిల్లాలోని నారాయణ్‌ఖేడ్ మీదుగా కామారెడ్డి జిల్లాలోకి ప్రవేశించనుంది. ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్, కామారెడ్డి నియోజకవర్గాల మీదుగా సాగి సిరిసిల్ల జిల్లాలోకి ప్రవేశిస్తుంది. యాత్రను విజయవంతం చేయడానికి జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీజేపీ టికెట్టుపై పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్నవారు సన్నద్ధమవుతున్నారు. పార్టీ ముఖ్యనేతలు పాల్గొనే కార్యక్రమంలో తమ బలాన్ని చాటుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరిగే యాత్రకు భారీగా జనాన్ని తరలించడానికి పోటీ పడుతున్నారు. జిల్లాలో రెండు రోజులపాటు విజయ సంకల్ప యాత్ర సాగుతుందని బీజేపీ నేతలు తెలిపారు.

రెట్టించిన ఉత్సాహంతో శ్రేణులు..

జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జీగా కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డిని నియమించారు. ఆయన అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ నేతలతో సమావేశాలు నిర్వహించి ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా చేయాల్సిన కార్యాచరణ గురించి దిశానిర్దేశం చేశారు. టికెట్టు ఎవరికి వచ్చినా పార్టీ అభ్యర్థి గెలుపు కోసం శ్రమించాలని ఆయన క్యాడర్‌ను కోరారు. కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలో కేసీఆర్, రేవంత్‌రెడ్డిల వంటి నేతలను ఓడించడంతో బీజేపీ నేతల్లో జోష్ పెరిగింది. కష్టపడితే జహీరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని గెలుచుకోగలమన్న నమ్మకంతో ఉన్న కాషాయ పార్టీ నేతలు.. రెట్టించిన ఉత్సాహంతో ముందుకు సాగుతున్నారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణం కల నెరవేరడం, దశాబ్ద కాలంగా మోదీ నాయకత్వంలో కేంద్రం చేసిన అభివృద్ధిని చెప్పుకోవడం ద్వారా ఎన్నికల్లో ప్రజల మద్దతు పొందాలని భావిస్తున్నారు.

న్యూస్‌రీల్

'జీపీల్లో సమస్యలు పరిష్కరించాలి'



బాన్సువాడ రూరల్: ప్రత్యేకాధికారులు రోజూ గ్రామ పంచాయతీలను సందర్శించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జెడ్పీ సీఈవో చందర్‌నాయక్ ఆదేశించారు. మంగళవారం ఆయన బాన్సువాడ మండల కార్యాలయాన్ని సందర్శించి గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించాలన్నారు. వీధుల్లో పర్యటించి పారిశుధ్య పనులను పర్యవేక్షించాలన్నారు. నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నూతన సీఈవోను ఎంపీపీ నీరజ వెంకట్రాంరెడ్డి సన్మానించారు.

బాధ్యతలు స్వీకరించిన కామారెడ్డి డీఎస్పీ



కామారెడ్డి క్రైం: కామారెడ్డి డీఎస్పీగా డి.నాగేశ్వర్‌రావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ప్రకాశ్‌ను మంచిర్యాలకు బదిలీ చేసిన విషయం తెలిసిందే.. ఆయన స్థానంలో నాగేశ్వరరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

గురుకులంలో విచారణ

నిజాంసాగర్: అచ్చంపేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చోటు చేసుకున్న ఘటనలపై మంగళవారం డీసీవో కృతమూర్తి విచారణ జరిపారు. ఇటీవల గురుకుల విద్యార్థి విషయంలో ఓ పార్ట్‌టైం టీచర్ అసభ్యంగా ప్రవర్తించిన విషయం తెలిసిందే. అలాగే గురుకులం ఆవరణలో ఉపాధ్యాయులు మద్యం సేవిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. దీనిపై రాష్ట్ర గురుకుల విద్యాలయం అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం డీసీవో విచారణ చేపట్టారు.

ఈ-కేవైసీ చేసుకున్నవారికే 'కిసాన్ సమ్మాన్ నిధి'

గాంధారి: ఈ-కేవైసీ చేసుకున్న రైతులకే పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం డబ్బులు వస్తాయని జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం ఆమె ఏవో నరేశ్‌తో కలిసి పలు గ్రామాలలో పర్యటించారు. తిమ్మాపూర్, చిన్నాపూర్ గ్రామాల్లో ఈ-కేవైసీపై రైతులకు అవగాహన కల్పించారు. మొక్కజొన్నలో ఎండాకు తెగులు, కాండం తొలిచే పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి రైతులకు వివరించారు. అనంతరం ఎరువులు, పురుగుమందుల దుకాణాలను తనిఖీ చేసి, రికార్డులు, బిల్లులను పరిశీలించారు.

'ప్రొటోకాల్'పై ఎంపీటీసీల ఆందోళన

- తహసీల్దార్ క్షమాపణతో సద్దుమణిగిన వివాదం

నాగిరెడ్డిపేట: నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో అధికారులు ప్రొటోకాల్ పాటించకపోవడంపై ఎంపీటీసీలు నిరసన తెలిపారు. మండలంలోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఎంపీటీసీలు మంగళవారం మండల పరిషత్‌కు వచ్చారు. చెక్కులు పంపిణీ చేసే సమయంలో ఎంపీటీసీలకు ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో వారు నిరసన తెలిపారు. ప్రొటోకాల్ అంశంపై ఎంపీపీ రాజ్‌దాస్, తహసీల్దార్ లక్ష్మణ్‌లను ప్రశ్నించారు. ఎమ్మెల్యే రాగానే ఎంపీటీసీ సభ్యులను పిలిచానని, కానీ కాంగ్రెస్ కార్యకర్తలు అధికసంఖ్యలో రావడం వల్ల కొంత ఇబ్బంది కలిగిందని ఎంపీపీ సమాధానమిచ్చారు. అయినా ఎంపీటీసీలు నిరసన కొనసాగించడంతో తహసీల్దార్ లక్ష్మణ్ కలగజేసుకొని క్షమాపణలు చెప్పారు. మరోసారి ఇలా జరగకుండా చూసుకుంటామని చెప్పడంతో ఎంపీటీసీ సభ్యులు శాంతించారు.

బస్టాండ్లలో ఖాళీ షాపుల వేలానికి టెండర్ల ఆహ్వానం

ఖలీల్‌వాడి: ఆర్టీసీ బస్టాండ్లలోని ఖాళీ షాపులు, స్థలాలకు వేలం పాట నిర్వహించనున్నట్లు ఆర్ఎం జానిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని బస్టాండ్లలో 62 షాపులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈనెల 29 వరకు టెండర్లు వేయవచ్చని పేర్కొన్నారు. టెండర్ ఫారాలు డిపో మేనేజర్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. మార్చి 1న ఉదయం 10:30 గంటలకు టెండర్లను ఓపెన్ చేస్తామని తెలిపారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



కామారెడ్డిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

- ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మనోజ్ డిమాండ్
- జిల్లాకేంద్రంలో ర్యాలీ, కలెక్టరేట్ వద్ద ధర్నా

కామారెడ్డి టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మనోజ్ డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో ర్యాలీ తీశారు. అనంతరం కలెక్టరేట్ వద్ద బైఠాయించారు. ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడుతూ మూడేళ్లుగా స్కాలర్‌షిప్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ రావడం లేదన్నారు. ఫీజులు చెల్లించాలని ప్రైవేట్ విద్యా సంస్థలు ఒత్తిడి తెస్తుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో పరిషత్ జిల్లా కన్వీనర్ చరణ్, జిల్లా హాస్టల్స్ కన్వీనర్ ఖలీల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రత్యూష, రోహిత్, సంజయ్, నాయకులు, వెంకటేష్, నవీన్, చరిత్, చందు, వరుణ్, ప్రసాద్, సమీర్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద బైఠాయించి ఆందోళన చేస్తున్న విద్యార్థులు

సంత్ సేవాలాల్ బోధనలు ఆచరణీయం

- బంజారాల అభివృద్ధికి కృషి చేస్తున్నాం
- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

పిట్లం: సంత్ సేవాలాల్ మహరాజ్ బోధనలు ఆచరణీయమని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సాయిగార్డెన్‌లో మంగళవారం సేవాలాల్ మహరాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి బంజారా సమాజంతో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. బంజారాల ఆశీర్వాదంతో జుక్కల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడమే కాకుండా రాష్ట్రంలో కాంగ్రెస్ సారథ్యంలో ప్రభుత్వం కూడా ఏర్పాటయ్యిందని పేర్కొన్నారు. రాష్ట్రం మొత్తంలో ట్రైబల్ హాస్టల్ లేని ఏకైక నియోజకవర్గం జుక్కల్ అన్నారు. దీనికి గత పాలకుల నిర్లక్ష్యమే కారణమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బంజారా సమాజ అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే బంజారా సంప్రదాయ నృత్యం చేశారు. కార్యక్రమంలో బంజారా నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'అవయవ దానంపై అవగాహన కల్పించాలి'



అవయవ దానం కార్డులను ఆవిష్కరిస్తున్న డీఈవో రాజు

కామారెడ్డి అర్బన్: అవయవదానంపై అవగాహన కల్పించాలని డీఈవో రాజు సూచించారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని సాందీపని డిగ్రీ కళాశాలలో తెలంగాణ బయోసైన్స్, ఫిజికల్ సైన్స్ ఫోరంల ఆధ్వర్యంలో జీవన్‌దాన్ ఆర్గనైజేషన్ సహకారంతో అవయవ దానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లెక్చరర్లు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

కార్యక్రమంలో డీఈవో రాజు మాట్లాడుతూ ఇటీవల దేవునిపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో చనిపోయిన కానిస్టేబుల్ బెజ్జంకి కార్తీక్ అవయవాలను దానం చేసి వారి కుటుంబ సభ్యులు ఆదర్శంగా నిలిచారన్నారు. అవయవదానానికి ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో బయోసైన్స్, ఫిజికల్ సైన్స్ ఫోరంల జిల్లా అధ్యక్షులు ప్రతాప్‌రెడ్డి, సిద్ధిరాంరెడ్డి, ప్రతినిధులు కృష్ణాకర్‌రావు, సురేష్, హన్మంత్‌రెడ్డి, రాములు, శరత్, సుప్రియ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా కేవీ భవన ప్రారంభోత్సవం

- వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీ
- పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్



కేంద్రీయ విద్యాలయ భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్, కలెక్టర్

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయ నూతన భవన ప్రారంభోత్సవం మంగళవారం అట్టహాసంగా జరిగింది. ప్రధాని మోదీ జమ్మూలోని ఐఐఎం నుంచి వర్చువల్‌గా భవనానికి ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమానికి ఎంపీ ధర్మపురి అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయాలను ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశమంతటా విస్తరిస్తోందన్నారు. నిజామాబాద్‌లో 7.5 ఎకరాల విస్తీర్ణంలో రూ. 22 కోట్లు వెచ్చిస్తూ అన్ని వసతులతో కేంద్రీయ విద్యాలయ నూతన భవనాన్ని నిర్మించామని పేర్కొన్నారు. టెన్త్ వరకు కొనసాగుతున్న ఈ విద్యాలయంలో త్వరలోనే 12వ తరగతి వరకు అప్‌గ్రేడ్ చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే బోధన్‌లోని కేంద్రీయ విద్యాలయ భవనాన్ని వచ్చే ఏడాది అందుబాటులోకి తెస్తామన్నారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయానికి అన్ని వసతులతో కూడిన నూతన భవనం అందుబాటులోకి రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ విద్యాలయాల్లో నాణ్యమైన విద్య అందుతోందన్నారు.

అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయాల్లోని విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించాలని బోధకులకు సూచించారు. విద్యాలయం ఆవరణలో చదువుల తల్లి సరస్వతీమాత విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు అవసరమైన నిధులను తాను సొంతంగా సమకూరుస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కేంద్రీయ విద్యాలయ సంస్థల హైదరాబాద్ ప్రాంతీయ డిప్యూటీ కమిషనర్ మంజునాథ్, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ మమత, కేవీ సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో చేరిన స్టాఫ్ నర్సులు

కామారెడ్డి టౌన్: ఇటీవల నియమితులైన స్టాఫ్ నర్సులు మంగళవారం రిపోర్ట్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫ్ నర్సుల పోస్టులను భర్తీ చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా జిల్లాలోని వైద్య కళాశాలతోపాటు టీవీవీపీ ఆస్పత్రులకు స్టాఫ్ నర్సులను కేటాయించింది. వైద్య కళాశాలలో 203 పోస్టులుండగా.. మంగళవారం సాయంత్రం వరకు 202 మంది స్టాఫ్ నర్సులు రిపోర్టు చేశారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్(టీవీవీపీ) ఆస్పత్రుల్లో 55 మంది చేరారు. బాన్సువాడ ఎంసీహెచ్‌లో 16 మంది, బాన్సువాడ ఏరియా ఆస్పత్రిలో 8 మంది, ఎల్లారెడ్డిలో 18 మంది, బిచ్కుందలో ఇద్దరు, దోమకొండ సీహెచ్‌సీలో ఆరుగురు, మద్నూర్‌లో ఒకరు, పిట్లంలో నలుగురు స్టాఫ్ నర్సులు విధుల్లో చేరారు.

నిజాంసాగర్ నీటి విడుదల



ప్రధాన కాలువలో ప్రవహిస్తున్న సాగర్ జలాలు

ఆయకట్టు కింద సాగు చేస్తున్న యాసంగి పంటల కోసం మంగళవారం నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ఐదో విడత నీటిని విడుదల చేపట్టారు. ప్రాజెక్టునుంచి ప్రధాన కాలువకు 1,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని నీటిపారుదలశాఖ ఏఈ శివప్రసాద్ తెలిపారు. నీటిని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా.. మంగళవారం సాయంత్రానికి 1,398.60 అడుగుల(9.915 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

– నిజాంసాగర్

'సృజనాత్మక శక్తిని వెలికి తీయాలి'



చుక్కాపూర్‌లో మాట్లాడుతున్న వీఆర్ శర్మ

మాచారెడ్డి: పిల్లల్లో సాధారణంగా వివిధ నైపుణ్యాలు దాగి ఉంటాయని, వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలని బాల సాహితీవేత్త డాక్టర్ వీఆర్ శర్మ సూచించారు. మంగళవారం చుక్కాపూర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సాహితీ సృజన వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొన్నారు. బాల సాహిత్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు స్వేచ్ఛనిస్తే మంచి కథలు రాయగలరని, చెప్పగలరని పేర్కొన్నారు. మాతృభాష మాధుర్యాన్ని వివరిస్తూ కథలు, కవితలు చెబుతూ విద్యార్థులను ఉత్తేజ పరిచారు. 6, 9 తరగతుల విద్యార్థులు ఈ కార్యశాలలో తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం దేవేందర్‌రావు, టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, ఉపాధ్యాయులు నరేందర్, దేవిచంద్, నరేష్, రాజేశ్వర్, మాన్సింగ్, శ్రీనివాస్‌రెడ్డి, రాజు, హరిప్రియ, సంయుక్తరాణి, లక్ష్మి పాల్గొన్నారు.

అవిశ్వాసంపై హైకోర్టు స్టే



రామారెడ్డి: ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డిపై ఏడుగురు ఎంపీటీసీ సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై హైకోర్టు స్టే విధించింది. దీనికి సంబంధించిన స్టే కాపీని ఆయన మంగళవారం ఆర్డీవో రంగనాథ్‌రావుకు అందించారు. ఈనెల 9న ఎంపీపీ దశరథ్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ రవీందర్‌రావులపై ఎంపీటీసీ సభ్యులు అవిశ్వాసం నోటీసులు ఇచ్చారు. మార్చి 6న అవిశ్వాసంపై బలపరీక్ష నిర్వహించడానికి ఆర్డీవో ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే అవిశ్వాసంపై ఎంపీపీ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు స్టే ఇవ్వడంతో ఆయన ఊపిరి పీల్చుకున్నారు.

'భీష్ముడిని ఆదర్శంగా తీసుకోవాలి'



సమావేశంలో పాల్గొన్న గంగపుత్ర సంఘం ప్రతినిధులు

కామారెడ్డి అర్బన్: ఇచ్చిన మాటకు కట్టుబడి ఆదర్శంగా నిలిచిన భీష్ముడిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని గంగపుత్ర చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు మంగళపల్లి శంకర్ గంగపుత్ర కోరారు. మంగళవారం గంగపుత్ర చైతన్య సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సీనియర్ సిటిజన్స్ ఫోరం భవనంలో భీష్మ ఏకాదశిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ భీష్ముడు గంగపుత్రుడనే విషయం చాలామందికి తెలియదన్నారు. గంగపుత్రుల వంశచరిత్ర మహాభారత కాలంనుంచి ఉందన్న విషయాన్ని గుర్తించాలన్నారు. గంగపుత్రులు ఒకే సంఘంగా ఏకం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమంలో అమరుడైన రామారెడ్డికి చెందిన పొట్టిగారి రమేష్ విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ పూస సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు జడల పరమేశ్వర్, ప్రతినిధులు డాక్టర్ రమేష్‌బాబు, ఎం.రాజన్న, పి.నర్సయ్య, రవికుమార్, ఆనంద్, టి.స్వామి, శంకర్, రామస్వామి, దేవరాజ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జోరందుకున్న చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ జోరందుకుంది. సోమవారం నాటికి 3లక్షల 3 వేల 201 మెట్రిక్ టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నామని పేర్కొన్నారు.

మెడికల్ కళాశాల సూపరింటెండెంట్‌కు సన్మానం



కామారెడ్డి టౌన్ : కామారెడ్డి మెడికల్ కళాశాలకు ఇంచార్జి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన రాంసింగ్‌ను బీఆర్ఎస్ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్‌రెడ్డి, జేపీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్ సుధాకర్ రావు, సంజీవరెడ్డి తదితరులున్నారు.

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యవర్గం



కామారెడ్డి టౌన్ : సీఐటీయూ అనుబంధం ఉన్న మున్సిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజనర్సు, ప్రధాన కార్యదర్శిగా ప్రభాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎల్ శంకర్, ఉపాధ్యక్షుడిగా జనార్దన్, గంగాధర్, ఎస్ నాగరాజు, రాజు, కృష్ణ, కోశాధికారిగా కుమ్మరి నర్సింలు, జాయింట్ సెక్రటరిగా అబ్బాస్, మీసాల రవి, భూలక్ష్మి, శ్రీనివాస్, సాయిలు, గౌరవ అధ్యక్షుడిగా చంద్రశేఖర్ తదితరులు ఎన్నికయ్యారు.

అవకతవకలపై డీపీఎం విచారణ

భిక్కనూరు : మండల కేంద్రంలోని పలు మహిళ సంఘాల్లో జరిగిన అవకతవకలపై డీపీఎం రవీందర్‌రావు మంగళవారం విచారణ నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన పలువురు మహిళలు తమ డబ్బులను సీఏలు వీవోలు సొంతానికి వాడుకున్నారని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీంతో డీపీఎం భిక్కనూరు మండల కేంద్రానికి వచ్చి విచారణ చేశారు. పలు మహిళ సంఘాల నుంచి సీఏలు వీవోలు డబ్బులు తీసుకుని బ్యాంక్‌లో డిపాజిట్ చేయలేదని తమ వద్ద తీసుకున్న డబ్బులకు రసీదులు కూడా ఇవ్వలేదని మహిళలు డీపీఎం రవీందర్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. 2015 నుంచి 2018 వరకు రూ. 5 లక్షల వరకు వాడుకున్నారని ఈ విషయంలో ఇద్దరిని విధుల నుంచి తొలగించినప్పటికీ వారు పూర్తిగా డబ్బులు చెల్లించలేదని తెలుసుకున్నారు. మండల కేంద్రంలో పలువురు సీఏలు వీవోఏలు రూ. లక్షల్లో డబ్బులను సొంతానికి వినియోగించుకున్నట్లు ఆరోపణలున్నాయి. వీటన్నింటిపై ఉన్నతాధికారులు విచారణ చేయాలని ప్రతి మహిళా సంఘం రికార్డులను పరిశీలించాలని పలువురు మహిళ సంఘాల సభ్యులు కోరుతున్నారు.

తెలుగుభాష తియ్యదనం..

- స్వచ్ఛదనానికి ప్రతీక మన భాష
- నేడు అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం



సన్మానం పొందిన తెలుగు ఉపాధ్యాయులు (ఫైల్)

నిజామాబాద్ సిటీ: స్వచ్ఛదనానికి ప్రతీకై నది.. అమ్మ ప్రేమలా తియ్యనైనది తెలుగు భాష. ప్రేమైనా.. బాధైనా.. కోపమైనా.. భావం ఏదైనా మనసార పలకాలన్నా.. చెవులారా వినాలన్నా అమ్మ భాషతోనే సాధ్యం. మన భాషను. యాసను కాపాడుకోవడం.. భావితరాలకు అందించడం మనందరి బాధ్యత. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ప్రతి ఏటా ఫిబ్రవరి 21న నిర్వహించాలని 1999 ఫిబ్రవరి 21న యునెస్కో ప్రకటించింది. దీంతో 2000 ఫిబ్రవరి21 నుంచి ప్రపంచ వ్యాప్తంగా అన్ని భాషల సంరక్షణ కోసం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవంగా జరుపుకొంటున్నాం.

తెలుగు భాషను కాపాడేందుకు జిల్లా తెలుగు ఉపాధ్యాయులు తమవంతు రచనలు చేస్తూ విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నారు. రూరల్ మండలంలోని గుండారం ప్రభుత్వ పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు, ప్రముఖ కవి డాక్టర్ కాసర్ల నరేశ్ రావు 20 ఏళ్లుగా పిల్లల కోసం పద్యాలు, గేయాలు, పాటలు, కథలు, నాటికలు, బుర్రకథలు, ఏకపాత్రాభినయాలు రచించి పిల్లలో తెలుగుభాష అభిమానాన్ని పెంచిపోషిస్తున్నారు. తాను రచించిన వాటిలో గేయాలను లలిత తరంగాలు అనే పుస్తకం, నాటికలను జై విజ్ఞాన్ అనే పుస్తకంగా తీసుకొచ్చారు. విద్యార్థుల్లో మాతృభాష తెలుగుపై మమకారం పెంచే విధంగా నిరంతరం శ్రమిస్తూ, వారిచే కవితలు, పద్యాలు, కథలు రాయిస్తున్నారు. బాలలేఖిని, గుండారం గువ్వలు అనే పుస్తకాలను విద్యార్థుల రచనలతో తీసుకొచ్చారు. పిల్లలను ప్రోత్సహిస్తూ మండల, జిల్లా, రాష్ట్రస్థాయి, జాతీయ, అంతర్జాతీయ పోటీలలో పాల్గొనేటట్లు మార్గదర్శనం చేస్తూ, బాలబంధువుగా నిలుస్తున్నారు.

తెలుగు భాషామల్లెలు గుండారం బడిపిల్లలు..

గుండారం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చదివేది ఆంగ్లమాధ్యమమైనా, మాతృభాష తెలుగు మీద మమకారాన్ని పెంచుకొని కవితలు, కథలు, పాటలు రాస్తున్నారు. ఈ పాఠశాల విద్యార్థులు ఇటీవల కెనడా దేశం కేంద్రంగా వివిధ దేశాలలో ప్రాంతాలలో ఉన్న బాలల కోసం వెలువడుతున్న 'అంతర్జాతీయ బాలల మాసపత్రిక-గడుగ్గాయి'లో నిర్వహించిన సంక్రాంతి కవితల పోటీల్లో పాల్గొని ప్రథమ, ద్వితీయ స్థాయిలో బహుమతులు సాధించారు. 9వ తరగతికి చెందిన ఒ.శ్రుతిరెడ్డి, ఆర్ లాస్య, ఎ కృష్ణవేణి, ఈ ఐశ్వర్య, బి సింధూజ, బి నిహారిక, 7వ తరగతికి చెందిన ఎస్ వైష్ణవిలకు వీరి మార్గదర్శక గురువులు డాక్టర్ కాసర్ల నరేశ్ రావు, డాక్టర్ వారె దస్తగిరి, ప్రధానోపాధ్యాయుడు బి అమర్‌నాథ్‌తో పాటు, ఉపాధ్యాయులు వీరికి సహకరిస్తున్నారు.

సహజంగా అలవడేదే మాతృభాష



బాల్యంలో తల్లి ఒడిని తొలి బడిగా చేసుకుని నేర్చుకుంటాం. ఈ నేర్పు సాంస్కృతిక భాషా వైవిధ్యానికి పునాదిలాంటిది. తెలుగులో అద్భుతమైన విజ్ఞాన భాండాగారం ఉంది. ఈ విషయం చాలామందికి తెలియక, తెలుగు తమ మాతృభాష అయినప్పటికీ చులకనగా భావిస్తారు. అందుకే భాషా కోవిదులు కృషిచేసి ముందు తరాలవారికి ఈ విజ్ఞాన భాండాగారాన్ని తెలియజేయాలి. అందరికీ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ శుభాకాంక్షలు.

– చింతల శ్రీనివాస్, తెలుగు ఉపాధ్యాయుడు

తెలుగు సాహిత్యంలో రాణిస్తున్న 'తడపాకల్' విద్యార్థులు



తడపాకల్ విద్యార్థులు రచించిన కథల పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ (ఫైల్)

మోర్తాడ్: 'చివురు బాలరచన చిగురెత్త మీనోట.. తెలుగు భాష కిదియ దివ్యశక్తి.. తాటి పాకలిపుడు తల్లి గౌతమితోడ.. తెలుగు వెలుగు నలది తేజరిల్లు' అని ప్రముఖ కవి బెజుగామ రామమూర్తి ఏర్గట్ల మండలం తడపాకల్ ఉన్నత పాఠశాల విద్యార్థులను ఉద్దేశించి ప్రశంసించారు. ఆ కవి రాసిన కవిత భావనకు అద్దం పట్టేలా తడపాకల్ విద్యార్థులు మాతృభాష సేవలో తరిస్తున్నారు. 2013 నుంచి మొదలైన తడపాకల్ విద్యార్థుల సాహితీ ప్రయాణం నిరాటంకంగా సాగుతూనే ఉంది. పుస్తకాలతో కుస్తీ పడుతూనే మరో పక్క తమ మెదడుకు పదును పెడుతూ కవితలు, కథలు రాస్తూ సాహిత్య లోకంలో విహరిస్తున్నారు. విమర్శకులను మెప్పించి వారి మన్ననలను పొందుతూ తెలుగు సాహిత్యానికి జీవం పోస్తున్న తడపాకల్ విద్యార్థులు ఇప్పటి వరకు శతకాలు, కవితలు, కథల పుస్తకాలను 15వరకు రాశారు. తమ తెలుగు ఉపాధ్యాయుడు ప్రవీణ్ శర్మ అందించిన ప్రోత్సాహంతో ఇక్కడి విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో ప్రతిభ చాటి అందరి ప్రశంసలను అందుకుంటున్నారు. ప్రముఖ కవులు డాక్టర్ సి నారాయణ రెడ్డి, ఆచార్య ఎల్లూరి శివారెడ్డిలతో పాటు ఐఏఎస్ అధికారులైన బుర్రా వెంకటేశం, యోగితారాణా, నారాయణరెడ్డి, రాజీవ్ గాంధీ హనుమంతు, అక్షరయాణ్ ఉమెన్ రైటర్స్ ఫోరం లాంటి ఎన్నో సాహిత్య సంస్థల ప్రతినిధులతో తడపాకల్ విద్యార్థులు సత్కారాలు పొందారు.

తడపాకల్ విద్యార్థులు రాసిన పుస్తకాలు

- 2013లో బాల కవితా తరంగాలు(వచనా కవితా సంపుటి)
- 2014లో చిగురు బాల శతకం(చందోబద్ధంగా రాసిన శతక పుస్తకం) జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సీ నారాయణ రెడ్డి ఆవిష్కరించారు.
- 2016లో చిగురు కొమ్మ(వచనా కవితల పుస్తకం)
- 2017లో చెట్టు పద్య శతకం(ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా హరిత హారం ప్రాముఖ్యతను తెలుపుతూ 15 మంది విద్యార్థులు రాసిన పుస్తకం)
- 2019లో కవినాయ వినాయక(కవితా సంపుటి), సమ్రీన్ రాసిన ముద్దబంతి, మరో విద్యార్థిని సౌమ్య రాసిన బంగారు బాల్యం పుస్తకాల ఆవిష్కరణ జరిగింది.
- తాజాగా వైష్ణవి రాసిన చదువు(సరళ వచనా శతకం), స్వాతంత్ర ఫలాలు(సరళ వచనా శతకం) పుస్తకాలు ఆవిష్కరించబడ్డాయి. మరో మూడు పుస్తకాలు ముద్రణ దశలో ఉన్నాయి.

డివైడర్ మూసివేతను అడ్డుకున్న యువకులు



భిక్కనూరు చర్చి సమీపంలో రహదారిపై డివైడర్లు ఏర్పాటు చేస్తున్న జీఎంఆర్ నిర్వాహకులు

భిక్కనూరు : మండల కేంద్రం సమీపంలో చర్చి సమీపంలో రామాయంపేట వైపు నుంచి భిక్కనూరు పట్టణంలోకి వచ్చే రోడ్డు డివైడర్‌ను జీఎంఆర్ అధికారులు మూసివేస్తుండగా మండల కేంద్రానికి చెందిన యువకులు మంగళవారం అడ్డుకున్నారు. రామాయంపేట నుంచి భిక్కనూరు పట్టణంలోకి వచ్చే రోడ్డు వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయని శ్రీరామదండు ప్రతినిధులు జీఎంఆర్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు స్పందించి రోడ్డు డివైడర్‌ను మూసి వేసేందుకు చర్యలు చేపట్టగా పలువురు యువకులు అడ్డుకున్నారు. ఇక్కడ రోడ్డు ప్రమాదాలు జరిగి చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారని డివైడర్ మూసివేయాలని కొందరూ యువకులు కోరుతుండగా, డివైడర్ మూసి వేయవద్దని మూసివేస్తే భిక్కనూరులోకి బస్సులు రావని ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని కొందరు యువకులు వాదించారు. దీంతో అధికారులు మధ్యలోనే పనులను నిలిపి వేశారు. గ్రామపంచాయతీలో అఖిలపక్ష సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుంటామని నేతలు చెప్పడంతో ఇరు వర్గాల యువకులు శాంతించారు.

వరిలో మోగిపురుగు నివారణ చర్యలు చేపట్టండి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : ప్రస్తుతం రైతులు సాగుచేస్తున్న వరిపంటలో మోగిపురుగు నివారణ కోసం రైతులు తగుచర్యలు చేపట్టాలని నాగిరెడ్డిపేట ఏవో విజయ శేఖర్ సూచించారు. నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం గ్రామశివారులో సాగు చేస్తున్న వరిపంటను మంగళవారం రైతులతో కలిసి పరిశీలించారు.

దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు ఆదరణ కరువు..

- ఎంపీ ధర్మపురి అర్వింద్
- నిజామాబాద్‌ను పసుపు ఎక్స్‌పోర్ట్ హబ్‌గా చేస్తామని హామీ



మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

సుభాష్‌నగర్: దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు ఆదరణ కరువైందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఐదేళ్లలో పసుపు సాగు విపరీతంగా పెరిగిందని, తెలంగాణలో మాత్రం కూలీ రేట్లు అధికంగా ఉండడంతో సాగు విస్తీర్ణం తగ్గిందని అన్నారు. ఈవిషయాన్ని అవగాహన లేని, పూటకో పార్టీ మార్చే వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు గ్రహించాలని అన్నారు. అంతర్జాతీయంగా పసుపు డిమాండ్‌ను బట్టి ధర ఉంటుందని, సాగు విస్తీర్ణం తగ్గితే ధర పెరగదని, తుమ్మలకు పసుపు సాగు, రైతుల కష్టాలు, ధరపై ఏ మాత్రం అవగాహన లేదని విమర్శించారు. బీజేపీకి పెరుగుతున్న ఆదరణ జీర్ణించుకోలేక కాంగ్రెస్ నాయకులు పనికిమాలిన రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. పసుపు సాగు విస్తీర్ణం, ధర పెంచే బాధ్యత ప్రధాని మోదీ, తాను తీసుకున్నామని, ఆ కమిట్‌మెంట్‌తోనే ఉన్నామని, నిజామాబాద్‌ను పసుపు ఎక్స్‌పోర్ట్ హబ్‌గా మారుస్తామని పేర్కొన్నారు.

24న 'ధర్మ బీజం' విజయవంతం చేయాలి..

నగరంలోని పాత కలెక్టరేట్ మైదానంలో ఈనెల 24న ధర్మపురి అర్వింద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్మ బీజం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీ కోరారు. ప్రముఖ ప్రవచనకారులు గరికపాటి నర్సింహారావు, ప్రముఖ ఆధ్యాత్మిక గాయకులు కన్హయ్య మిట్టల్ హాజరవుతారని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి,గద్దె భూమన్న, పద్మారెడ్డి, నాగోళ్ల లక్ష్మీనారాయణ, పంచారెడ్డి ప్రవళిక, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఫెల్లోషిప్‌కు సౌత్ క్యాంపస్ విద్యార్థుల ఎంపిక



గణేశ్



వినోద్

భిక్కనూరు : తెలంగాణ యునివర్సిటీ సౌత్‌క్యాంపస్‌కు చెందిన ఇద్దరూ విద్యార్థులు సీఎస్ఐఆర్ ఫెల్లోషిప్‌కు మంగళవారం ఎంపికయ్యారు. సౌత్ క్యాంపస్‌కు చెందిన కెమిస్ట్రీ విద్యార్థులు పి గణేష్, 87వ ర్యాంక్, ఎం వినోద్ జాతీయ స్థాయిలో 140వ ర్యాంకును సీఎస్ఐఆర్ నెట్ నందు జూనియర్ రిసెర్చ్ ఫెల్లోషిప్‌కు ఎంపికయ్యారని కెమిస్ట్రీ విభాగాధిపతి నాగరాజు తెలిపారు. ఈ ఫెల్లోషిప్‌తో ప్రతిష్టాత్మక విద్యాసంస్థలైన ఐఐటీ ఐఐఎస్ఈఆర్ ఐఐసీఐ వంటి విద్యాసంస్థల్లో పరిశోధనలు చేసేందుకు శాస్త్రవేత్తలుగా వారు ఎదగడానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పలువురు ప్రొఫెసర్లు గణేశ్, వినోద్‌తో పాటు వారికి మార్గదర్శకం వహించిన కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ నాగరాజును అభినందించారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి



మాచారెడ్డిలో మాట్లాడుతున్న ఎంపీపీ..

మాచారెడ్డి : విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నతంగా ఎదగాలని మాచారెడ్డి ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు అన్నారు. మంగళవారం మాచారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన స్పోర్ట్స్ డే,కళాశాల వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో ఎలాంటి సమస్యలున్న తన దృష్టికి తేవాలన్నారు. ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు తాను సొంతంగా బహుమతులు అందజేశారు. అలాగే కళాశాల ఆవరణలో షెడ్డు నిర్మాణం కోసం రూ. 30వేలు విరాళాన్ని అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ బుద్ధిరాజ్ మాట్లాడుతూ కళాశాలతో పాటు మండల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న నర్సింగరావును అభినందించారు. సీడీసీ చైర్మెన్ రాజమౌళి గుప్త, ఎంపీడీవో గోపిబాబు, ఎంపీవో నాగరాజు గ్రామ పెద్దలు ఉన్నారు.

ఆయకట్టును కాపాడుకోవాలి

కమ్మర్‌పల్లి: ఎస్సారెస్పీ నుంచి మిడ్ మానేరు డ్యాం వరకు ఉన్న ఆయకట్టును కాపాడుకోవాలని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనడానికి వెళ్తూ మార్గమధ్యలో కమ్మర్‌పల్లి శివారులో వరద కాలువ వద్ద ఎమ్మెల్యే ఆగారు. వరద కాలువ ద్వారా దిగువకు నీరు వెళ్తుండటం గమనించి అక్కడి నుంచే ఎస్సారెస్పీ ఎస్ఈతో ఫోన్‌లో మాట్లాడారు. ఎస్సారెస్పీలో ఉన్న నీటిని వరద కాలువ ద్వారా దిగువకు కేటాయింపు కన్న ఎక్కువ వెళ్లకుండా చూడాలని కోరారు. ప్రాజెక్ట్‌లో నీటి నిల్వ ఎంత మేరకు ఉంది, ఈ సీజన్‌లో పంటలకు ఎన్ని టీఎంసీలు అవసరం అవుతాయని అడిగి తెలుసుకున్నారు. వరద కాలువ ద్వారా ఎట్టి పరిస్థితుల్లో కిందికి కేటాయింపు కన్నా ఎక్కువ నీరు వదలొద్దని అన్నారు. అలాంటి నిర్ణయాలు ఉంటే ప్రభుత్వం, నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడుతానన్నారు. లేకపోతే రైతుల పక్షాన పోరాడుతామని అన్నారు.

23న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

కామారెడ్డి అర్బన్ : జిల్లాకేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఈనెల 23న ఉద యం 8గంటలకు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ విష యాన్ని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్య క్ష, ప్రధాన కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, 16, 18, 20 బాలబాలికల విభాగాలలో 400 మీటర్ల పరుగు పందెం నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యేవారు త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించే 400 మీటర్ల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు పుట్టినతేదీ ధ్రువీకరణ పత్రంలో ఎంపిక పోటీలకు హాజరుకావాలని సూచించారు.

ఉత్సాహంగా ఫేర్‌వెల్ పార్టీ



బాన్సువాడ : స్థానిక మున్నూరు కాపు సంఘం భవనంలో బీర్కూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఫేర్‌వెల్ పార్టీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రఘు మాట్లాడుతూ విద్యార్థులకు ఇంటర్ విద్యే కీలకమన్నారు. పరీక్షలను ఇష్టంతో రాయాలని ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అలరింపజేశాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మోహన్‌రెడ్డి, అధ్యాపకులు చంద్రశేఖర్, దేవిసింగ్, శ్యాంసుందర్, సౌమ్య తదితరులున్నారు.

క్రైం కార్నర్

ఇద్దరిపై కేసు నమోదు

ఎల్లారెడ్డి: ఓ వివాహితను చంపుతామని బెదిరించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని బీసీ కాలనీలో నివాస ఉండే అమీనాబేగానికి అదే కాలనీకి చెందిన కటికె షన్ను, అయూబ్‌లు ఈ నెల 16న రూ. వెయ్యి అప్పుగా ఇవ్వాలని కోరారు. ఆమె ఇవ్వకపోవడంతో వారు కక్ష పెంచుకుని వివాహితను చంపుతామని బెదిరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఒకరి అదృశ్యం



కామారెడ్డి క్రైం: పట్టణంలోని ఎన్జీఓఎస్ కాలనీలో నివాసం ఉండే కేసిరెడ్డి నర్సింహారెడ్డి అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖరరెడ్డి మంగళవారం తెలిపారు. ఈ నెల 17న ఇంటి నుంచి వెళ్లిన నర్సింహారెడ్డి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

కల్దుర్కిలో ఒకరు..

బోధన్ టౌన్: మండలంలోని కల్దుర్కి గ్రామానికి చెందిన సిరిగిరి బుజ్జిబాబు అనే వ్యక్తి అదృశ్యమైనట్లు పట్టణ సీఐ వీరయ్య మంగళవారం తెలిపారు. ఈ నెల 19న ఇంటి నుంచి వెళ్లిన బుజ్జిబాబు తిరిగి రాలేదన్నారు. కుటుంబీకులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రెండు గ్రామాల్లో 144 సెక్షన్

వేల్పూరు: జానకంపేట, పచ్చలనడ్కుడ గ్రామాల్లో గురువారం వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని తహసీల్దార్ సరిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు గ్రామాల మధ్య వాగులో సరిహద్దు సర్వే నిర్వహిస్తున్నందున గ్రామాల్లో 144 సెక్షన్ విధించినట్లు పేర్కొన్నారు. ఎవరైనా 144 సెక్షన్‌ను ధిక్కరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నకిలీ జర్నలిస్టు బైండోవర్

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రానికి చెందిన జర్నలిస్టునని చెలామణి అవుతున్న ఓ నకిలీ జర్నలిస్టును తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. ఓ కుటుంబ తగదాలలో తలదూర్చి ఎలాంటి కేసులు లేకుండా ఒప్పందం చేయిస్తానని బాధితుడి నుంచి డబ్బును డిమాండ్ చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.

బస్సును ఓవర్‌టేక్ చేయబోయి యువకుడి మృతి

- మరొకరికి తీవ్రగాయాలు



సుమన్ (ఫైల్)

బాన్సువాడ: ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేయబోయి ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన బాన్సువాడలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్లం మండలం టిక్యానాయక్ తండాకు చెందిన సుమన్(16), పిట్లంకు చెందిన ముస్తాఫా స్నేహితులు. వీరు బాన్సువాడ బస్టాండ్ నుంచి బైక్‌పై పిట్లంకు వెళ్తుండగా పట్టణంలోని రాజీవ్‌చౌరస్తాలో ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేయబోయి బస్సు టైర్ల కింద పడ్డారు. ఈ ఘటనలో సుమన్ అక్కడికక్కడే మృతి చెందగా, ముస్తాఫాకు తీవ్రగాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడ్డ ముస్తాఫను స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

సౌదీలో సదాశివనగర్ వాసి..

సదాశివనగర్: మండల కేంద్రానికి చెందిన పోలబోయిన నారాయణ(66) సౌదీ అరేబియాలో గుండెపోటుతో మృతి చెందాడు. బతుకుదెరువు కోసం నారాయణ సౌదీకి ఆరేళ్ల క్రితం వెళ్లాడు. అక్కడ పని చేస్తున్న ప్రదేశంలో 20 రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందినట్లు అక్కడి పోలీస్‌స్టేషన్‌ను నుంచి సమాచారం అందినట్లు కుటుంబీకులు తెలిపారు. తన తండ్రి మృతదేహాన్ని స్వదేశానికి తెప్పించాలని మృతుడి కుమారుడు శ్రీనివాస్, కుటుంబీకులు ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షుడు కోటపాటి నరసింహానాయుడిని కలిసి విన్నవించారు.

దుబాయ్‌లో గన్నారం యువకుడు..



విజయ్ (ఫైల్)

ఇందల్వాయి: మండలంలోని గన్నారం గ్రామానికి చెందిన కాశెట్టి విజయ్(27) దుబాయ్‌లో గుండెపోటుతో ఆదివారం ఉదయం మృతి చెందినట్లు గ్రామస్తులు మంగళవారం తెలిపారు. మృతుడి తండ్రి అనారోగ్యంతో మృతి చెందగా కుటుంబ బాధ్యతల నిమిత్తం నాలుగేళ్లుగా విజయ్ దుబాయిలో ఉంటున్నాడు. తాను పనిచేస్తున్న కంపెనీకి ఉదయం వెళ్లే సమయంలో గుండెపోటు రావడంతో మృతి చెందాడన్నారు.

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య



జలంధర్ (ఫైల్)

మోపాల్: జీవితంపై విరక్తితో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని చిన్నాపూర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అక్కం జలంధర్ (46) వీఆర్ఏగా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చూయించినా నయం కావడం లేదు. దీంతో జీవితంపై విరక్తితో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య కళావతి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

కుటుంబ కలహాలతో వివాహిత..

సిరికొండ: కుటుంబ కలహాలతో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కొండాపూర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పొడెండ్ల లక్ష్మి(45)కి తరచూ కుటుంబ సభ్యులతో గొడవలు జరుగుతున్నాయి. లక్ష్మి భర్త రాజన్న గల్ఫ్ దేశం ఖతార్‌లో ఉంటున్నాడు. ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవ జరుగగా మనస్తాపానికి గురైన లక్ష్మి సోమవారం రాత్రి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి అన్న శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన్నట్లు పేర్కొన్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడికి గాయాలు

నందిపేట్: బైక్ అదుపుతప్పి కిందనపడిన ఘటనలో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. మండల కేంద్రానికి చెందిన హైమద్ ఎమ్మార్వో కార్యాలయం నుంచి బైక్‌పై వెళ్తుండగా ప్రమాదవశాత్తు కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కారు బోల్తా ఒకరికి గాయాలు

రామారెడ్డి: మండల శివారులోని పటేల్ చెరువు సమీపంలో మంగళవారం రాత్రి కారు బోల్తా పడిన ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. పోసానిపేట నుంచి ఇసన్నపల్లికి కారులో వస్తున్న గ్రామానికి చెందిన పెద్ద లింబాద్రి ఎదురుగా వస్తున్న బైకును తప్పించబోయి ప్రమాదవశాత్తు కారు బోల్తా పడింది. ఈ ఘటనలో లింబాద్రికి గాయాలయ్యాయి.

అక్రమంగా ఇసుక రవాణా చేపడితే చర్యలు తప్పవు

బోధన్‌రూరల్: సాలూర, బోధన్ మండలాల్లో ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని రూరల్ ఎస్సై నాగనాథ్ అన్నారు. బోధన్, సాలూర మండలాల్లో మంగళవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. ఎస్సై వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

పేకాట స్థావరంపై దాడి

నాగిరెడ్డిపేట: మండలంలోని మాల్తుమ్మెద శివారులో పేకాటస్థావరంపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. గ్రామశివారులోని పటేల్‌చెరువు వద్ద పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని పట్టుకొని వారి నుంచి రూ.8,230నగదు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. వీరిపై కేసునమోదు చేసినట్లు పేర్కొన్నారు.